## క్లుప్తంగా

### తాగునీటి బోరు ఏర్పాటు


తాగునీటి బోరు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

గొలుగొండ: స్థానిక ఎస్సీ కాలనీలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నట్టు సర్పంచ్ కసిపల్లి బుజ్జి(అప్పారావు) తెలిపారు. మండల పరిషత్ అభివృద్ధి నిధులు రూ.లక్షతో శనివారం కాలనీలో తాగునీరు బోరు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఎంపీపీ గజ్జలపు మణికుమారి ఈ నిధులు మంజూరు చేసినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పారేపల్లి నాగేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు చేపల లక్ష్మీనారాయణ తదితర్లు పాల్గొన్నారు.

### ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా జరపాలి


ఘాటీలు మాదిగ

మాడుగుల రూరల్ : ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని, ఈ సందర్భంగా అన్ని గ్రామాల్లోను ఎమ్మార్పీ జెండాను ఆవిష్కరించాలని మహజన సోషలిస్ట్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఘాటీలు మాదిగ అన్నారు. మాడుగుల మండలం ఒమ్మలిలో శనివారం ఘాటీలు విలేకరులతో మాట్లాడారు. మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి చిరకాల ఆకాంక్ష అయిన వర్గీకరణ కోసం అలుపెరగని పోరాటాన్ని సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్టు చెప్పారు.

### 60 మందికి వైద్య పరీక్షలు


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి హరిప్రవీణ్


గొలుగొండ: ప్రస్తుతం కురుస్తున్న వర్షాల వల్ల వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, అప్రమత్తంగా ఉండాలని కృష్ణదేవిపేట వైద్యాధికారి హరిప్రవీణ్ తెలిపారు. లింగంపేటలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించి, 60 మందికి వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య సూత్రాలు తప్పక పాటించాలని సూచించారు.

### పరిశుభ్రతతో అతిసార నియంత్రణ


గుల్లేపల్లిలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

కె.కోటపాడు : పరిశుభ్రతతో అతిసార వ్యాధిని అరికట్టవచ్చని చౌడువాడ పీహెచ్‌సీ హెల్త్ అసిస్టెంట్ డి.ఎస్.ఎన్.రాజు తెలిపారు. గుల్లేపల్లిలో అతిసార నియంత్రణపై శనివారం వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని, ఆరు బయట మలవిసర్జన మానాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ పావని, ఏఎన్ఎం లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

### విధిగా నెలకు రెండు సార్లు సమావేశాలు


సమావేశంలో పాల్గొన్న ఏపీఎం వెంకటలక్ష్మి

కె.కోటపాడు : డ్వాక్రా సంఘాల సభ్యులతో నెలకు రెండు సార్లు గ్రామ సంఘం సమావేశాలను విధిగా వీవోఏలు నిర్వహించాలని ఏపీఎం వెంకటలక్ష్మి తెలిపారు. జోగన్నపాలెం-2 గ్రామ సంఘం సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న పి.వెంకటలక్ష్మి గ్రామ సంఘం నెలవారీ వసూళ్లు, అప్పుల రికార్డులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ రికార్డులను సక్రమంగా నిర్వహించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో క్లస్టర్ కోఆర్డినేటర్ వెంకటరావు, వీవోఏలు చిన్నమ్ములు పాల్గొన్నారు.



# ప్రమాదభరితంగా డైవర్షన్ రోడ్లు

- వరదనీరు వస్తే రాకపోకలు బంద్
- ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయని అధికార్లు


విజయరామరాజు పేటలో దెబ్బతిన్న డైవర్షన్ రోడ్డు


కూలిన వడ్డాది పెద్దేరు వంతెన


పేటలో కూలిన తాచేరు వంతెన


వడ్డాదిలో డైవర్షన్ రోడ్డును ఆనుకుని ప్రవహిస్తున్న నీరు

బుచ్చెయ్యపేట: భీమునిపట్నం,నర్సీపట్నం (బీఎన్) రోడ్డులో ఉన్న రెండు డైవర్షన్ రోడ్లు ప్రమాదభరితంగా మారాయి. తాత్కాలికంగా నిర్మించిన వడ్డాది,విజయరామరాజుపేట డైవర్షన్ రోడ్లపై రాకపోకలు సాగించాలంటే వాహనదారులు భయాందోళనలకు గురవుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు రెండు డైవర్షన్ రోడ్లను ఆనుకుని నీరు ప్రవహిస్తోంది. ఏ మాత్రం వర్షం ఎక్కువ పడినా పెద్దేరు,కోనాం రిజర్వాయర్ల గేట్లు ఎత్తి నీరు విడుదల చేస్తే రెండు డైవర్షన్ రోడ్లు నీటి ఉధృతికి కొట్టుకుపోవడం ఖాయం. ఇదే జరిగితే అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు,విశాఖపట్నం జిల్లాల ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం తప్పదు. ఈ రహదారుల్లో తిరిగే విశాఖ,పాడేరు, అకాపపల్లి,నర్సీపట్నం, కాకినాడ,చోడవరం ఆర్టీసీ బస్సులతో పాటు ఇతర వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయి వేలాది మంది ప్రయాణికులు,వాహనదార్లు తీవ్ర ఇబ్బందులు పడతారు. ఇప్పటికే వడ్డాదిలో ఉన్న పెద్దేరు వంతెన,విజయరామరాజుపేటలో ఉన్న తాచేరు వంతెన కూలిపోయి వాహనదార్లు అవస్థలు పడుతున్నారు. విజయరామరాజుపేట వద్ద డైవర్షన్ రోడ్డులో పెద్దపెద్ద గోతులు పడి రాళ్లు తేలిపోవడంతో కార్లు,ఆటోల అడుగుభాగాన అవి తగిలి వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. ఈ డైవర్షన్ రోడ్డులో పెద్ద పెద్ద గోతుల పడడంతో పలు వాహనాలు బురదలో కూరుకుపోయి ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయి. తక్షణం అధికార్లు స్పందించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకపోతే వేలాది మంది ప్రయాణికులు కష్టాలు తప్పేలాలేవు. వర్షాకాలం వచ్చిందంటే భీమునిపట్నం, నర్సీపట్నం రోడ్డులో రాకపోకలు సాగించేందుకు ప్రయాణికులు భయందోళనలు చెందుతారు. పురాతన కాలం నాటి ఈ రోడ్డులో వందేళ్ల క్రితం నిర్మించిన పెద్దేరు,తాచేరు వంతెనలు కూలిపోయాయి. సుమారు రూ.40 లక్షలతో వడ్డాది,విజయరామరాజుపేట గ్రామాల్లో కూలిన వంతెనల వద్ద డైవర్షన్ రోడ్లను గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఏర్పాటు చేశారు. తాచేరు వంతెన నిర్మాణానికి రూ. ఐదు కోట్లు గత ప్రభుత్వంలోనే మంజూరు కాగా, వడ్డాది పెద్దేరు వంతెన నిర్మాణానికి రూ.25 కోట్లుతో ప్రతిపాదనలు పంపించారు. ఇటీవల అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ ఆర్అండ్‌బీ అధికారులను వెంట తీసికొచ్చి విజయరామరాజుపేట వద్ద కూలిన తాచేరు వంతెనను పరిశీలించి, నిధులుండడంతో వెంటనే నిర్మాణ పనులు చేయాలని అధికారులను ఆదేశించారు. ఎంపీ ఆదేశించి నెల రోజులవుతున్నా అధికార్లు వంతెన పనులు ప్రారంభించకపోగా దెబ్బతిన్న డైవర్షన్ రోడ్ల గోతుల్లో గుప్పెడు మట్టి కూడా వేయలేదు. డైవర్షన్ రోడ్లు వరద నీటిలో కొట్టుకుపోకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి వంతెన నిర్మాణ పనులు చేపట్టి రాకపోకలకు అంతరాయం కలగకుండా చూడాలని వాహనదార్లు కోరుతున్నారు. దీనిపై ఆర్అండ్‌బీ డీఈ నాగ మోహనరావును వివరణ కోరగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు కెళ్లి పనులు ప్రారంభిస్తామన్నారు.

## వైఎస్సార్ జయంతిని ఘనంగా నిర్వహించాలి


మాట్లాడుతున్న ఉమాశంకర్ గణేష్


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ధర్మశ్రీ

నర్సీపట్నం/చోడవరం: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని ఈనెల 8వ తేదీన అన్ని గ్రామాల్లో ఘనంగా నిర్వ హించాలని మాజీ ఎమ్మెల్యేలు ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్, కరణం ధర్మశ్రీ పార్టీ కేడర్‌కు పిలుపు ఇచ్చా రు. నర్సీపట్నం,చోడవరంలలో వారు వేర్వేరుగా మాట్లాడారు. గ్రామాల్లోని వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళుల రి ్పంచి, సేవా కార్యక్రమాలు నిర్వహించాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. చోడవరం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ధర్మశ్రీ మాట్లాడుతూ రాజశేఖరరెడ్డి జయంతిని పురస్కరించుకుని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు సేవా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఓటమి చెందామన్న నిరాశతో ఎవరూ ఉండవద్దని, అధికారంలో ఉన్న ఐదేళ్ల ప్రజలకు పూర్తిస్థాయిలో సేవచేశామన్నారు. ఇప్పుడు ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేయడానికి కార్యకర్తలంతా సిద్ధంగా ఉండాలని తెలిపారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక వైఎస్సార్‌సీపీ కార్యాలయాలను కూల్చడమే పనిగా పెట్టుకుందని, ఇటువంటి చర్యలకు స్వస్తిపలకాలన్నారు. పార్టీ కార్యాలయాల లీజు విషయంలో అన్ని పార్టీలు అనుసరించే విధానాన్నే వైఎస్సార్‌సీపీ కూడా అనుసరించిందే తప్ప ఎక్కడా అక్రమ కట్టడాలు చేయలేదని చెప్పారు. చోడవరం నియోజకవర్గంలో గతంలో ఎప్పుడూ లేని సంస్కృతిని ఈ సారి కొన్ని గ్రామాల్లో టీడీపీ కార్యకర్తలు తీసుకొచ్చి దాడులకు పాల్పడడం, శిలాఫలకాలు ధ్వంసం చేయడం వంటి సంఘటనలకు దిగడం విచారకరమన్నారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదన్న విషయం తెలుసుకుంటే మంచిదని ధర్మశ్రీ అన్నారు. నియోజకవర్గంలో మెజార్టీ పంచాయతీలు, మండల పరిషత్‌లు, జెడ్పీటీసీలు వైఎస్సార్‌సీపీకు చెందిన వారు ఉన్నారన్నారు. ప్రొటోకాల్ ప్రకారం వారందర్నీ ప్రభుత్వ కార్యక్రమాలకు ఆహ్వానించాల్సిన బాధ్యత ఉందన్నారు. కొత్తగా గెలిచిన స్థానిక ఎమ్మెల్యే స్థానిక సంస్థల కార్యాలయాలకు వచ్చినప్పుడు గౌరవంతో ఆహ్వానించి, అంతా కలిసిమెలసి ఉండాలన్నారు. ఈ సమావేశంలో నాలుగు మండలాల ఎంపీపీలు,జెడ్పీటీసీలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నాతవరం: దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతిని ఘనంగా నిర్వహించాలని వైఎస్సార్‌సీపీ నాతవరం మండల అధ్యక్షుడు లగుడు నాగేశ్వరరావు తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడు తూ గ్రామాల్లో సర్పంచులు ఎంపీటీసీ సభ్యుల ఆధ్వర్యంలో, మండల కేంద్రంలో జెడ్పీటీసీ సభ్యురాలు, ఎంపీపీ, వైస్ఎంపీపీలు, వివిధఅనుబంధ సంఘాలు అధ్యక్ష కార్యదర్శులు మహిళా సంఘాల ఆధ్వర్యంలో జయంతి ఉత్సవాలు నిర్వహించాలన్నారు.

### కాలుష్య నివారణకు కృషి చేయాలి


మొక్క నాటుతున్న ఉపాధ్యాయులు

మాకవరపాలెం: కాలుష్య నివారణకు అందరూ కృషి చేయాలని హెచ్‌పీసీఎల్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ లక్ష్మణ్ కోరారు. స్థానిక హైస్కూల్ ఆవరణలో శనివారం విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజురోజుకూ కాలుష్యం పెరిగి పర్యావరణానికి నష్టం వాటిల్లుతోందన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం అచ్యుతరామయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కాశీపురం మాజీ సర్పంచ్ మృతి


పేరునాయుడు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న బూడి ముత్యాలనాయుడు

దేవరాపల్లి: వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, కాశీపురం మాజీ సర్పంచ్ బొడ్డు పేరునాయుడు(76) శనివారం మృతి చెందారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న పేరునాయుడు కాశీపురంలోని ఇంటిలో తుది శ్వాస విడిచారు. పేరునాయుడు మృతదేహానికి మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు పూలమాల వేసి నివాళులర్పించారు. అతని కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. జెడ్పీటీసీ కర్రి సత్యం, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూరె బాబురావు, డాక్టర్ వరదపురెడ్డి సింహాచలం నాయుడు, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కోఆపరేటివ్ సొసైటీల అధ్యక్షులు, వైఎస్సార్‌సీపీ, టీడీపీ తదితర రాజకీయ పార్టీల నాయుకులు పేరునాయుడు మృతదేహం వద్ద ఘనంగా నివాళులర్పించారు. గ్రామంలో రాజకీయాలకు అతీతంగా ఆయన అందించిన సేవలను స్మరించుకున్నారు. అనంతరం గ్రామస్తులు, కుటుంబ సభ్యుల అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు నిర్వహించారు.

## పశువుల కొనుగోలుకు వడ్డీ లేని రుణాలు


అత్యధిక పాల ఉత్పత్తి సాధించిన రైతుకు బహుమతి అందజేస్తున్న డైరెక్టర్ గంగాధర్

కె.కోటపాడు : పాల దిగుబడిని పెంచుకోవడం ద్వారా కుటుంబానికి ఆర్థికంగా వెన్నుదన్నుగా రైతులు నిలవవచ్చని విశాఖ డెయిరీ డైరెక్టర్ సుందరపు గంగాధర్ అన్నారు. చౌడువాడ పాల సంఘం సర్వసభ్య సమావేశాన్ని శనివారం పాల సంఘం అధ్యక్షుడు కోమార వెంకటరమణ(పీర్‌లెస్) ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న గంగాధర్ మాట్లాడుతూ డెయిరీ ద్వారా ఒక్కో పశువు కొనుగోలుకు రూ.60వేల చొప్పున వడ్డీలేని రుణం ఇవ్వనున్నట్టు తెలిపారు. పాల సంఘం అధ్యక్షుడు వెంకటరమణ మాట్లాడుతూ సభ్య రైతులకు 50 శాతం రాయితీపై చాప్ కట్టర్లను అందజేస్తున్నట్టు తెలిపారు. ఇప్పటికి 20 మంది రైతులకు వాటిని అందజేసినట్టు చెప్పారు. పాల సంఘంలో గల రైతులు చేతిబోరు ఏర్పాటు చేసుకుంటే వారికి బోరు హెడ్‌తో పాటు మెటీరియల్‌ను ఇవ్వనున్నట్టు తెలిపారు. అధిక పాల ఉత్పత్తి సాధించిన ఆరుగురు రైతులకు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దాడి ఎరుకు నాయుడు, ఎంపీటీసీ ఏటుకూరి రాజేష్, మాజీ పాల సంఘం అధ్యక్షుడు కోమార ఎర్రునాయుడు, వేతన కార్యదర్శి చిన్ని వెంకట నర్సింహమూర్తి పాల్గొన్నారు.

# జంతువుల పెంపకంలో జాగ్రత్తలు పాటించాలి


గుల్లేపల్లిలో కుక్కకు వ్యాక్సిన్ వేస్తున్న పశువైద్య సహాయకుడు జగన్నాథం


మామిడిపల్లిలో పెంపుడు కుక్కలకు టీకాలు వేస్తున్న పశువైద్యాధికారి ప్రియాంక


రోలుగుంటలో టీకాలు వేయిస్తున్న పశు వైద్యాధికారి నూకేశ్వరరావు


కొరువాడ పశువైద్య కేంద్రంలో వ్యాక్సిన్ వేస్తున్న పశువైద్యాధికారి నాయుడు


కుక్కలకు టీకాలు వేస్తున్న ఏడీ రాంబాబు


బుచ్చెయ్యపేటలో కుక్కలకు వ్యాక్సిన్ వేస్తున్న వైద్య సిబ్బంది

కె.కోటపాడు : జంతువుల పెంపకంలో తగిన జాగ్రత్తలను పాటించాలని కొరువాడ పశువైద్యాధికారి సీహెచ్.వై.నాయుడు అన్నారు. జునోసిస్ డే సందర్భంగా శనివారం కొరువాడ పశువైద్య కేంద్రం వద్ద పెంపుడు జంతువులకు ఉచితంగా వ్యాక్సిన్‌ను వేశారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి నాయుడు మాట్లాడుతూ తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. గుల్లేపల్లి రైతు సేవా కేంద్రం వద్ద పెంపుడు జంతువులకు పశువైద్య సహాయకుడు బి.జగన్నాథం వ్యాక్సిన్‌ను వేశారు. గుల్లేపల్లిలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ బండారు దేముళ్ళు, ఎంపీటీసీ కశిరెడ్డి దేముడుబాబు తదితరులు పాల్గొన్నారు.

రోలుగుంట: స్థానిక పశువైద్యాధికారి నూకేశ్వరరావు ఆధ్వర్యంలో సిబ్బంది శనివారం 18 కుక్కలకు రేబిస్ వ్యాధి నిరోధక టీకాలను వేశారు. ఈ సందర్భంగా జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే వాధుల గురించి పశువైద్యాధికారి వివరించారు.

బుచ్చెయ్యపేట: స్థానిక ప్రభుత్వ పశువుల ఆస్పత్రిలో 36 పెంపుడు కుక్కలకు రేబిస్ నిరోధిక టీకాలను వేశారు. జునోసిస్ డే సందర్భంగా స్థానిక వైద్యాధికారి ఉమామహేశ్వరి ఆధ్వర్యంలో శనివారం ఈ కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ సుంకరి లక్ష్మి, సిబ్బంది నాగేశ్వరరావు, సత్యనారాయణ,సీతారామ్ తదితర్లు పాల్గొన్నారు.

దేవరాపల్లి: వరల్డ్ జునోసిస్ డేను పురస్కరించుకుని మామిడిపల్లి పశువైద్యశాలలో పెంపుడు కుక్కలకు స్థానిక పశువైద్యాధికారి జి.ప్రియాంక శనివారం యాంటీ రేబిస్ వ్యాక్సిన్ వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిచ్చి కుక్క కాటు వేయడం ద్వారా సోకే రేబిస్ వ్యాధి ప్రాణాంతకమైందని చెప్పారు. ఈ వ్యాధి ద్వారా ఏటా దేశంలో 30 వేల మంది ప్రాణాలు కోల్పోతున్నట్లు తెలిపారు.

నర్సీపట్నం:జునోసిస్ డేను పురస్కరించుకుని స్థానిక ప్రాంతీయ పశువైద్యాలయంలో 120 పెంపుడు కుక్కలకు ఉచితంగా యాంటీ రేబిస్ టీకాలు వేశారు. ఈ సందర్భంగా జంతువుల పెంపకందారులకు ఏడీ డాక్టర్ డబ్ల్యూ.రాంబాబు అవగాహన కల్పించారు. విధిగా పెంపుడు కుక్కలకు టీకా వేయించాలని తెలిపారు. ఈ శిబిరంలో డాక్టర్లు పుష్ప, రమేష్, కె.రామమోహన్, శిరిషా పాల్గొన్నారు.

## ప్రాణాంతక రేబిస్‌పై అప్రమత్తం


కాశీపురం హైస్కూల్‌లో రేబిస్‌పై అవగాహన కల్పిస్తున్న పశువైద్యాధికారి మంజూషరాణి


జె.నాయుడుపాలెంలో విద్యార్థులతో కలసి ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు


అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న పశువైద్యాధికారి రాఘవమ్మ


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ అశోక్

దేవరాపల్లి: ప్రాణాంతక రేబిస్ వ్యాధి పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలని మండల పశు వైద్యాధికారి కె.మంజూషరాణి సూచించారు. కాశీపురం హైస్కూల్‌లో హెచ్ఎం ఆర్.రామలక్ష్మి ఆధ్వర్యంలో వరల్డ్ జునోసిస్ డేను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మంజుషరాణి మాట్లాడుతూ రేబిస్ వ్యాధి సోకితే కనిపించే లక్షణాలను విద్యార్థులకు వివరించారు. పెంపుడు జంతువుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను విద్యార్థులకు ఎంఈవో బి.పడాల్‌దాస్ వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాము, మాధవి, సత్యవతి, పూర్ణిమ, కొట్టాన రాంబాబు తదతరులు పాల్గొన్నారు.

**పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు**

రోలుగుంట: జునోసిస్ డే సందర్భంగా మండలంలో పలు జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో శనివారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. జె.నాయుడుపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో కలసి ఉపాధ్యాయులు ర్యాలీ నిర్వహించి, అవగాహన కల్పించారు. అనంతరం ఉపాధ్యాయుడు వీరభద్రం మాట్లాడుతూ కుక్క కరిచిన వెంటనే చికిత్స చేయించుకోవాలని తెలిపారు. కుసుర్లపూడి జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం శెట్టి మోహన్, రోలుగుంటలో హెచ్ఎం ప్రసాద్‌రావు ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

చీడికాడ: పెంపుడు కుక్కలకు రేబిస్ రాకుండా ముందస్తు జాగ్రతలు తీసుకోవాలని పశు వైద్యాధికారి రాఘవమ్మ తెలిపారు. చీడికాడలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పశువుల నుంచి మనుషులకు సంక్రమించే రేబిస్, ఆంత్రాక్స్, బర్డ్ ఫ్లూ తదితర వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యాధికారులు ఎల్.ఎస్.ఎ.వర్మ, దుగ్గిరాల మనోజ్, కుమార్, పశుసంవర్ధక సహాయకులు రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

మాకవరపాలెం: రేబిస్ ప్రాణాంతక వ్యాధి అని, దీనిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మాకవరపాలెం పశువైద్యాధికారి అశోక్ సూచించారు. జునోసిస్ డే సందర్భంగా శనివారం స్థానిక ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువుల ద్వారా వచ్చే వ్యాధులు, నివారణ చర్యల గురించి తెలియజేశారు. కుక్కల ద్వారా సోకే రేబిస్ వ్యాధి అత్యంత ప్రమాదకరమన్నారు. మండలంలోని అన్ని పశువైద్య కేంద్రాల్లోనూ పెంపుడు కుక్కలకు వ్యాక్సిన్‌లు ఉచితంగా వేసినట్టు చెప్పారు. పాఠశాల హెచ్ఎం అచ్యుతరామయ్య, వెటర్నరీ అసిస్టెంట్ సంతోషి తదితరులు పాల్గొన్నారు.

## సకాలంలో ప్రజా సమస్యల పరిష్కారం

నాతవరం: ప్రజల నుంచి వచ్చిన అర్జీలను సకాలంలో పరిష్కరించాలని తహసీల్దార్ ఎస్.రమేష్‌కుమార్ అన్నారు. ఆయన తన కార్యాలయంలో శనివారం సిబ్బందితో సమావేశం నిర్వహించి సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల రెవెన్యూపరమైన సమస్యలను ప్రభుత్వ నిబంధనల మేరకు పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. పట్టాదారు పాసుపుస్తకాలు కోసం మ్యుటేషన్లు సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. విద్యార్థులకు కుల ధ్రువీకరణ పత్రాలను జాప్యం లేకుండా అందజేయాలని తెలిపారు. మండలంలో అధికంగా గిరిజన గ్రామాలు ఉండడంతో వారికి కుల ధ్రువీకరణ పత్రాల జారీలో విధిగా నిబంధనలు పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సుధాకర్, సీనియర్ అసిస్టెంటు డి.కృష్ణ, ఆర్ఐ హరి సర్వేయర్ బాలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## దోమల నివారణతో వ్యాధుల నిర్మూలన


అవగాహన ర్యాలీలో పాల్గొన్న వైద్య సిబ్బంది

కె.కోటపాడు : దోమల నివారణతోనే వ్యాధుల నిర్మూలన సాధ్యమవుతుందని మలేరియా సబ్ యూనిట్ అధికారి రమణ అన్నారు. డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవం సందర్భంగా లంకవానిపాలెం పీహెచ్‌సీలో శనివారం వైద్యాధికారి శైలజ ఆధ్వర్యంలో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. అనంతరం వైద్య సిబ్బందితో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దోమల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. దోమ కాటు వల్ల మలేరియా, డెంగ్యూ తదితర వ్యాధులు వ్యాపించి మరణాలు సంభవించే పరిస్థితి ఉందన్నారు. వైద్యాధికారి శైలజ మాట్లాడుతూ వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు ప్రజలను చైతన్యవంతులను చేయాలన్నారు. హెల్త్ సూపర్‌వైజర్ సన్యాసిరావు, పీహెచ్ఎన్ ప్రమీల, హెల్త్ అసిస్టెంట్ పి.త్రినాథ్ పాల్గొన్నారు.



## బాధిత కుటుంబానికి ఉద్యోగుల సంఘం బాసట


బాధిత కుటుంబానికి నగదు అందజేస్తున్న ఉద్యోగుల సంఘం సభ్యులు, గ్రామ పెద్దలు

దేవరాపల్లి: మండలంలోని బోయిలకింతాడలో బాధిత కుటుంబానికి స్థానిక ఉద్యోగుల సంఘం సభ్యులు బాసటగా నిలిచారు. గ్రామానికి చెందిన ఎలిశెట్టి లక్ష్మి పాము కాటుకు గురై మరణించడంతో ఆమె కుటుంబానికి ఉద్యోగుల సంఘం సభ్యుడు దాసరి మణికంఠ చేతులు మీదుగా గ్రామ పెద్దల సమక్షంలో రూ. 12 వేలు ఆర్థికసాయాన్ని శనివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక గ్రామ సర్పంచ్ బూరె బాబురావు, కొప్పాక వెంకటరావు, అన్నం రామునాయుడు, దాసరి వెంకటరమణ, దాసరి వెంకునాయుడు, అన్నం సాంబమూర్తి, కొప్పాక దేముళ్లు, అన్నం వెంకటరావు, కొప్పాక ఆదిబాబు, కడిడినాగేశ్వరరావు, తాటికొండ గణేష్, కడిమి కృష్ణ, వియ్యపు అప్పారావు, విడుదల సత్యారావు తదితర గ్రామ పెద్దలు పాల్గొన్నారు.